సాక్షి ప్రకాశం

గురువారం । 4 । జూలై । 2024



విద్యుత్ కనెక్షన్ ఇస్తారా.. చావమంటారా..!

తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించకుండా వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. - 8లో..



మోసాన్ని అరికట్టాలి

నాసిరకం మోనో డాన్ బ్లాక్ టైగర్ రొయ్య పిల్లలను హేచరీల నుంచి సరఫరా చేయకుండా చూడాలని రొయ్యల రైతు సంఘం నాయకులు కోరారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు అల్లూరి జయంతి వేడుకలు

ఒంగోలు సెంట్రల్: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఒంగోలు గిరిజన భవన్‌లో నిర్వహిస్తారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (డీటీడబ్ల్యూ) పీ జగన్నాథరావు తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా గిరిజన నాయకులంతా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ సమర్పించాలి

ఒంగోలు సెంట్రల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విశ్వవిద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ కౌన్సిలింగ్‌లో స్పాట్ అడ్మిషన్ పొందిన ఇప్పటికే ఆయా పాఠశాలలు, కాలేజీలో జాయిన్ అయిన విద్యార్థులు ఈనెల 5వ తేదీలోపు తమ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలను సబ్‌మిట్ చేయాలని గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జయ కోరారు. అలా ఇవ్వని వారి సీట్లను క్యాన్సిల్ చేసి మిగిలిన సీట్లను మెరిట్ ఆర్డర్ ప్రకారం ప్రకటిస్తారని తెలిపారు. వివరాలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు

ఒంగోలు: నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 2023 డిసెంబర్‌లో జరిగిన పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది కూడా ఆగస్టు 31లోగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్పులు చేసిన నూతన హోం పేజీ, నూతన మొబైల్ యాప్, అప్‌డేట్ చేసిన వెబ్ వెర్షన్‌తో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ అప్లికేషన్ ప్రారంభించారన్నారు. వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) సమర్పణ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.స్కాలర్‌షిప్స్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 30లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో విద్యార్థులు సమర్పించాలని, సెప్టెంబర్ 15లోగా స్కూలు నోడల్ ఆఫీసర్, సెప్టెంబర్ 30వ తేదీలోగా జిల్లా నోడల్ ఆఫీసర్ ఆమోదించాలన్నారు. మిస్‌మ్యాచ్ వివరాలను విద్యార్థులు సరిచేయించుకోవాలని, ప్రతి విద్యార్థి బ్యాంకు ఖాతాను తన ఆధార్ నంబర్‌కు సీడ్ చేయించుకుని డీబీటీ ద్వారా డబ్బులు జమయ్యేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

గంగపుత్రులకు భరోసా..
కడలి ఘోషేనా?

సముద్రంలో వేటే మత్స్యకారుల జీవనాధారం. ఏటా రెండు నెలలు మత్స్య సంపద పునరుత్పత్తి కాలంగా సముద్రంలో వేట నిషేధం కొనసాగుతోంది.
ఈ సమయంలో వారి జీవనోపాధి కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం అరకొర మందికి అరకొరగా సాయం అందించింది.
మత్స్యకారుల స్థితిగతులు తెలుసుకున్న గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం 2019 నవంబరు 21న వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించి రెండింతలు పెంచి సాయం అందించారు. లబ్ధిదారుల ఎంపికలో ఉదారంగా చేపట్టారు. ఆ తర్వాత ఏటా మే నెలలోనే ఈ పథకం ద్వారా మత్స్యకారులకు లబ్ధి చేకూర్చింది. ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఇంకా దీనిపై తేదీ కూడా నిర్ణయించకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- వేట నిషేధకాల సాయం కోసం ఎదురుచూపులు
- గత ఐదేళ్లూ మే నెలలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- భరోసా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో కూటమి వాగ్దానం
- ఈ పథకానికి సంబంధించి ఇంత వరకు అధికారులకు అందని మార్గదర్శకాలు
- భరోసా ఊసెత్తని ముఖ్యమంత్రి, మంత్రులు
- చేపల వేట సరిగా లేక ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు



చేపల వేట సక్రమంగా లేక వలల్లో పడిన చేపలు ఏరుకుంటున్న మత్స్యకారులు

సింగరాయకొండ:

గంగపుత్రుల భరోసా.. కడలి ఘోషగా మారింది. మత్స్యకార భరోసాపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సముద్రంలో వేట తప్ప మరో జీవనాధారం లేని మత్స్యకారులకు గత ప్రభుత్వంలో ఐదేళ్లూ వరసగా క్యాలెండర్ ప్రకటించి.. ఆ తేదీల్లోనే అందజేసింది. చేపల పునరుత్పత్తి నేపథ్యంలో ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు రెండు నెలల పాటు సముద్రంలో వేట నిషేధం అమలవుతోంది. ఈ రెండు నెలల పాటు మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేది. గతంలో టీడీపీ పాలనలో లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదు. అరకొర మందికి అదీ ఏటా రూ.4 వేలు మాత్రమే సాయం అందించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికలోనే కాకుండా, నిషేధ సాయాన్ని రూ.10 వేలకు పెంచింది. ఏటా మే నెలలోనే ఈ సాయాన్ని అందిస్తూ వచ్చింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ మత్స్యకారులకు ఇచ్చే సాయాన్ని రూ.20 వేలకు పెంచి ఇస్తామని హామీలు గుప్పించింది. అయితే అధికారంలోకి వచ్చిన టీడీపీ ఈ పథకానికి సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 5,459 మంది లబ్ధిదారులు

జిల్లా సముద్ర తీరం వెంబడి ఐదు మండలాల్లో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. 50 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వం పింఛన్ పథకం అమలు చేస్తుండగా, 50 ఏళ్లలోపు మత్స్యకారులకు ప్రభుత్వం మత్స్యకార భరోసా ఇస్తోంది. జిల్లాలో 5,459 మంది లబ్ధిదారులు ఉన్నారు. మత్స్యకార భరోసా పథకానికి అర్హులుగా ఆయా మండలాల మత్స్యశాఖాధికారులు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మత్స్యకారుల జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. ఆ ప్రకారం కొత్తపట్నం మండలంలో 3,113 మంది, నాగులుప్పలపాడు మండలంలో 307 మంది, ఒంగోలు మండలంలో 502 మంది, సింగరాయకొండ మండలంలో 1,440 మంది, టంగుటూరు మండలంలో 97 మంది భరోసాకు అర్హుల జాబితాను సిద్ధం చేశారు.

సాగని వేట..ఆదాయం రాక అవస్థ

చేపల వేట నిషేధకాలం ముగిసింది. ఈదఫా చేపల వేట బాగా ఉంటుందని ఆశించిన మత్స్యకారులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు, మరొక పక్క సోనాబోట్ల తాకిడి కారణంగా చేపల వేట ఆశాజనకంగా లేదు. సముద్రంలో చేపల వేట ప్రారంభమై 19 రోజులు గడిచినా.. కేవలం వారం రోజులు మాత్రమే చేపల వేట సాగించామని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. వేటకు వెళ్లిన రోజు సుమారు రూ.3 వేల నుంచి రూ.5 వేల మాత్రమే చేపలు పడుతున్నాయని, ఆ మొత్తం ఖర్చులకు మాత్రమే సరిపోతుందని ఆదాయం రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిషేధ భత్యం కోసం ఎదురుచూపులు

సముద్రంలో వేట నిషేధ భత్యాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుండగా ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి రూ.20 వేల ఇస్తానని ప్రకటించింది. కానీ వేట నిషేధ కాలం పూర్తయి రోజులు గడుస్తున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మత్స్యశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఏ ఒక్కరూ కూడా వేట నిషేధ భత్యం ఎప్పుడు ఇస్తారో ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ఇప్పటికే రెండు దఫాలుగా కేబినెట్ కమిటీ సమావేశాలు జరిగినా.. వేట నిషేధ భత్యంపై చర్చ రాకపోవడంతో మత్స్యకారులకు నిరాశతో ఉన్నారు. దీనికి తోడు ఇంత వరకు మత్స్యశాఖాధికారులకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని తెలుస్తోంది. వేట నిషేధ భత్యం రాక, చేపల వేట సక్రమంగా సాగక నష్టాన్ని భరిస్తున్నామని, కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదేళ్లుగా భరోసా వచ్చింది..



ఐదు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా మత్స్యకార భరోసా వచ్చింది. ఈసారి ఎన్నికల్లో చంద్రబాబు వేట నిషేధ భత్యం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. కానీ వేట నిషేధకాలం ముగిసి రోజులు గడుస్తున్నా ఒక్క ప్రకటనా రాలేదు. త్వరగా ఇచ్చి ఆదుకోవాలని కోరుకుంటున్నాను.

– వాయిల గిరీష్, చెల్లమ్మ గారి పట్టపుపాలెం, పాకల

భరోసా ఇచ్చి ఆదుకోవాలి



ప్రతి సంవత్సరం వేట నిషేధ కాలం పూర్తి కాగానే మత్స్యకార భరోసాను ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఈసారి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకార భరోసా పై ఎటువంటి ప్రకటన చేయలేదు. చేపల వేట కూడా ఆశాజనకంగా లేదు. భరోసా మొత్తం ఇచ్చి మత్స్యకారులను ఆదుకోవాలి.

– వాయిల బాబు, చెల్లమ్మగారి పట్టపుపాలెం, పాకల

ఆయిల్ ఖర్చులు కూడా రావడంలేదు



నాకు ప్రతి సంవత్సరం మత్స్యకార భరోసా వస్తుంది. ఈసారి ఇంకా భరోసా మొత్తం రాలేదు. అధికారులను అడిగితే సమాధానం లేదు. చేపల వేటకు వెళితే సరిగా పడటం లేదు. ఆయిల్ ఖర్చులకు కూడా రావటం లేదు. ఎన్నికలప్పుడు భరోసా మొత్తం రూ.20 వేలు ఇస్తామని, మత్స్యకారులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. భరోసా మొత్తం ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. – వాయిల బద్రి, పాకల

ఇంత వరకూ భరోసా ఊసేలేదు..



నాకు మత్స్యకార భరోసా వస్తుంది. ప్రతి సంవత్సరం వేట నిషేధకాలం పూర్తికాగానే భరోసా ఇచ్చేవారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం భరోసా మొత్తాన్ని రూ.20 వేలు పెంచి ఇస్తానని చెప్పింది. కానీ ఇంత వరకు ఆ ఊసే లేదు. ఇస్తారో లేదో తెలియదు.

– కటారి పాపయ్య, పాకల

వేట ఆశాజనకంగా లేదు..



నాకు మత్స్యకారభరోసా వస్తుంది. ఈ సంవత్సరం భరోసా మొత్తం రాలేదు. సముద్రంలో వేటకు వెళితే చేపలు పడడం లేదు. ఆశాజనకంగా వేట లేదు. మత్స్యకార భరోసా ఇస్తే ఆదరువుగా ఉంటుంది. ఎప్పుడు ఇస్తారో అర్థం కావటం లేదు.

– వాయిల రామయ్య, పాకల



సముద్రపు ఒడ్డున నిలిపి ఉంచిన బోటు

బతుకుదెరువు నేలమట్టం

- కనిగిరిలో అధికారుల దుశ్చర్య
- ముందస్తు సమాచారం లేకుండా దుకాణాలు నేలమట్టం
- రూ.లక్షలు విలువజేసే సామగ్రి ధ్వంసం
- రేపటి నుంచి మా బతుకులు ఎలా అంటూ చిరు వ్యాపారుల ఆవేదన
- న్యాయ పోరాటం చేస్తామన్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల



చెప్పుల బజారులో ధ్వంసమైన దుకాణాలు

కనిగిరి రూరల్: నాలుగు దశాబ్దాలుగా కనిగిరి పట్టణంలో రోడ్డుపక్కన వ్యాపారాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వందలాది బడుగుల కుటుంబాల బతుకుదెరువు కప్పుకూలిపోయింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో అధికార పార్టీ నేతల మెప్పు కోసం మున్సిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా బుధవారం తెల్లవారు జాము నుంచే పేదల జీవితాలతో చెలగాటమాడారు. పెద్ద ఎత్తున పోలీసుల బలగాలతో జేసీబీలు తీసుకొచ్చి కరెంటు తీసేసి కష్టజీవులపై కర్కశంగా వ్యవహరించారు. దుకాణాల్లో సామాన్లు తీసుకుంటామని వేడుకుంటున్నా పట్టించుకోకుండా దుకాణాలను నేలమట్టం చేశారు. పట్టణంలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించి యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడ్డారు. ఫలితంగా దుకాణాల్లో రూ.లక్షలు విలువజేసే సామగ్రి నుజ్జునుజ్జయ్యాయి.. బడుగులపై కనికరం చూపించాలని ఒకవైపు ప్రజా సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులను కోరుతున్నా పట్టించుకోకపోవడంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తమతున్నాయి. ఉదయం చెప్పుల బజార్, పామూరు బస్టాండ్‌లో ప్రారంభించిన తొలగింపులు చర్చి సెంటర్, కందుకూరు రోడ్డు, ఒంగోలు బస్టాండ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రాత్రి వరకూ దుకాణాలు తొలగిస్తూనే ఉన్నారు.

కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని చిరు వ్యాపారులు అధికారులను నిలదీస్తున్నా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. పెద్ద ఎత్తున అప్పులు చేసి దుకాణాలు నడుపుకుంటున్నామని, అధికారుల తీరుతో లక్షలు విలువజేసే సరుకు నాశనమైందని, మా జీవితాలు వీధిన పడ్డాయని బాధితులు విలపిస్తున్నారు. రేపటి నుంచి మా బతుకులు ఎలా అంటూ వారు రోదిస్తున్న తీరు అందర్నీ కలచివేసింది. వందలాది మంది చిరు వ్యాపారుల జీవితాలు ఛిద్రమవుతున్నా అధికార పార్టీ నేతలు స్పందించకపోవడం గమనార్హం. కమిషనర్ టీవీ రంగారావు, ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్, సీఐలు, ఎస్సైలు బంకుల తొలగింపును దగ్గరుండి పర్యవేక్షించారు. అధికారుల దుశ్చర్యలతో పట్టణంలో సుమారు 500 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీధిన పడ్డాయి.


మా కడుపు కొట్టిన వారు బాగుపడరు



చెప్పుల బజార్‌లో చిన్న పాటి బంకులో గాజుల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నా. మాకు కనీస సమాచారం నోటీసు ఇవ్వకుండా బంకును చిందర వందర చేసి పగుల కొట్టారు. మైనార్టీ లోన్ తీసుకుని గాజులకొట్టు పెట్టుకుని వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఉన్న జీవనాధారం తీశారు. నా కుటుంబం ఎలా బతకాలి. నెల నెలా రుణం కిస్తీలు ఎలా చెల్లించాలి. పేదల కడుపు కొట్టిన వారు బాగుపడరు.

– ఎస్‌కే బేగం

సుమారు రూ.1.50 లక్షల నష్టం జరిగింది



మాకు సమాచారం చెప్పకుండా బంకును పగుల కొట్టారు. నాది వాచీలు సెల్ రిపేర్ పాయింట్. ల్యాప్‌ట్యాప్, బ్యాటరీలు అన్నీ పగిలిపోయాయి. నేను వచ్చేసరికి బంకును ధ్వంసం చేశారు. రోడ్లపై బంకులు పెట్టుకుని జీవించే మాపై ఇంత అధికార దౌర్జన్యమా.. కనీసం ప్రత్యామ్నాయం చూపలేదు. మేమంతా బంకులకు పన్నులు కూడా చెల్లిస్తున్నాం. కనీసం సమచారం ఇవ్వకుండా పోలీస్ బెటాలియన్‌తో వచ్చి బంకులను ధ్వంసం చేశారు. రూ.1.50 లక్షలు నష్టపోయా.

– రషీద్ బాష



దుకాణాలను ధ్వంసం చేస్తున్న జేసీబీ



బంకులను తొలగిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు



కనిగిరి డిపో రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

మా మీద కోపంతోనే కమిషనర్ ఇలా చేశారు



చెప్పుల బజార్‌లో చిన్న పాటి మొబైల్ రిపేర్ షాప్ పెట్టుకుని జీవిస్తున్నా. మాకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాత చర్యలు తీసుకోమని కమిషనర్‌ను అనేక సార్లు విన్నవించాం. మాకు ఇదే జీవనాధారమని, రోడ్డు పాలు చేయవద్దని బతిమిలాడాను. కనీసం సామాన్లు తీసుకోనివ్వలేదు. మాకు పై నుంచి ఒత్తిడి వచ్చిందంటూ .. పేద వర్గాలపై కోపంతోనే కమిషనర్ నియంతలా మా బంకులను ధ్వంసం చేశారు. పేదల పాపం తప్పక తగులుతుంది.

– ఖాదర్ వలి

అధికార పార్టీ నేత మెప్పు కోసమే..



కేవలం అధికార పార్టీ నేత మెప్పు కోసమే మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు బలహీన వర్గాలపై దమనకాండ సృష్టించారు. కనీస సమాచారం ఇవ్వకుండా వీధి వ్యాపారులపై పోలీసు బలగాలతో దౌర్జన్యం చేశారు. కమిషనర్ ఒక నియంతలా వ్యవహరించి.. తెల్లవారుజామున దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మున్సిపాలిటీలో పట్టణంలో సైడు కాలువల అభివృద్ధి, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కాకుండానే.. వచ్చే గ్రాంట్‌లో పెడతామంటూ అత్యుత్సాహంతో చేసిన చర్య ఇది. ఇందులో అధికార పార్టీ మెప్పు కోసం తాపత్రయం ఉందే తప్ప ప్రజా ప్రయోజనం ఏమీ లేదు. పేదల ఉపాధిని దెబ్బతీసి కమిషనర్ పైశాచిక ఆనందం పొందుతున్నారు. పూర్తిగా అధికారంలో ఉన్న అధికార పార్టీ నేతలు ముందు బైపాస్ నిర్మాణాన్ని పూర్తి చేస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుంది. వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. వీధి వ్యాపారులంతా సంఘటితంగా ఉపాధి రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి.

– వీసీ కేశవరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు

వీధి వ్యాపారుల పక్షాన న్యాయ పోరాటం



40 ఏళ్లుగా పాలకులు మారుతున్నా వీధి వ్యాపారులను ఇలా ఇబ్బంది పెట్టలేదు. కనిగిరి పట్టణానికి ఇప్పటికే మంజూరైన బైపాస్ రోడ్డును నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కరించవచ్చు. కానీ, అధికార పార్టీ నేతల ఆదేశాలతో కమిషనర్ దుందుడుకుగా వ్యవహరించడం సరికాదు. కనీస సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా వందలాది కుటుంబాలను వీధిన పడేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేస్తాం.

– దద్దాల నారాయణ యాదవ్, వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, పక్కన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన చెవిరెడ్డి, చింతలచెరువు

కనిగిరి రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రకాశం జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత చింతలచెరువు సత్యన్నారాయణ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మారంరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులున్నారు.

ఉపాధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



ఉపాధి పనులపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశం భవనంలో డ్వామా అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డ్వామా ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆరా తీశారు. జిల్లాలో కూలీలకు లభిస్తున్న రోజువారీ వేతనం, రాష్ట్ర స్థాయిలో లభిస్తున్న రోజువారీ సగటు వేతనం, జిల్లాలో కల్పిస్తున్న పనిదినాల సంఖ్య తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర సగటు కంటే జిల్లా సగటు మెరుగ్గా ఉండేలా పనిచేయాలన్నారు. కేవలం పూడికతీత పనులకే పరిమితం కాకుండా స్థానిక అవసరాలను గుర్తించి ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే చేపట్టిన పనులు పూర్తి చేసేందుకు గడువు నిర్దేశించుకుని పూర్తి చేయాలన్నారు. అనుమతి లభించినా ఇప్పటికీ ప్రారంభించని పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో అనుమతిస్తూ తీర్మానాలు చేసిన పనుల ప్రతిపాదనలు తుది ఆమోదం కోసం కలెక్టర్‌కు అందజేయాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. దీనిలో డ్వామా పీడీ అర్జునరావు, అదనపు పీడీ వండర్‌మెన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, సెరీకల్చర్ అధికారి సుజయ్‌కుమార్, డ్వామా ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలు, వాటర్ షెడ్ పీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియాను రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల వివరాలను సంస్థ అధ్యక్షురాలు అయిన కలెక్టర్‌కు వివరించారు. త్వరలో నిర్వహించే మేనేజింగ్ కమిటీ సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు, కమిటీ సభ్యులు ప్రసన్న రాజు, మారెళ్ల సుబ్బారావు, శివమ్ శ్రీహరి, కోటేశ్వరమ్మ, అడ్మిన్ సుధాకరరావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంభం అర్బన్ కాలనీలో చోరీ



గదిలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని ఓ గృహంలో బుధవారం దొంగలు చొరబడి ఒక తులం బంగారు ఉంగరాలు, 20 తులాల వెండి పట్టీలు అపహరించుకెళ్లారు. అందిన సమాచారం మేరకు.. అర్బన్ కాలనీలో నివాసం ఉండే రసూల్ నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలసి ఢిల్లీ వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి ఇంటికి చేరుకోగా తాళం పగలగొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా గదిలోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందివడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు రసూల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సురేష్ నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించిన రాచర్ల మండలం అనుమలవీడు గ్రామ సచివాలయ జూనియర్ లైన్‌మన్ సురేష్ నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 19వ తేదీన విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలైన సురేష్ నాయక్ వైద్యశాలలో చికిత్స పొందుతూ జూలై 1వ తేదీన మరణించారని తెలిపారు. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన సురేష్ మరణంతో ఆ కుటుంబం ఆసరా కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే సురేష్ కుటంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటుగా ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మోసాన్ని అరికట్టాలి

మోనో డాన్ బ్లాక్ టైగర్ కావాలి

- నాసిరకం రొయ్య పిల్లలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- జిల్లా రొయ్యల రైతు సంఘం నాయకుల విన్నపం



జిల్లా కమిటీ సమావేశంలో చర్చిస్తున్న సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రొయ్యల రైతులకు నాసిరకం మోనో డాన్ బ్లాక్ టైగర్ రొయ్య పిల్లలను హేచరీల నుంచి సరఫరా కాకుండా ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రొయ్యల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో బుధవారం జిల్లా రొయ్యల రైతు సంఘ అధ్యక్షుడు దుగ్గినేని గోపినాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 27 వేల ఎకరాల్లో రైతులు రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, గత రెండేళ్లుగా జిల్లాలో సుమారు 12 వేల ఎకరాల్లో రైతులు మోనో డాన్ బ్లాక్ టైగర్ రకం రొయ్యల సాగుకు మొగ్గుచూపారని చెప్పారు. ప్రస్తుతం వేసవిలో సాగు చేసిన రొయ్యల చెరువులకు మోనో డాన్ బ్లాక్ టైగర్ రొయ్య పిల్లలను హేచరీస్ నాసిరకం సరఫరా చేసినందున అవి సక్రమంగా ఎదుగుదల లేక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వర్షాకాలంలో రైతులు తమ చెరువులను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారని చెప్పారు. అయితే గత అనుభవాల దృష్ట్యా ఏ రకం రొయ్యలు సాగు చేయాలో తెలియని అయోమయ స్థితిలో రైతులు ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకుని రొయ్యల రైతులకు నాణ్యమైన మోనో డాన్ బ్లాక్ టైగర్ రొయ్య పిల్లలు హేచరీస్ నుంచి సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా వేసవిలో సాగు చేసి నష్టపోయిన రైతులకు హేచరీస్ నుంచి నష్టపరిహారం ఇప్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రొయ్యల రైతు సంఘం తీర్మానించింది. వెనామీ రకం రొయ్యలకు వంద కౌంట్ ధర రూ.240 తగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. సమావేశంలో రొయ్యల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుగ్గినేని గోపినాథ్, కంతూరి సుబ్బా రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పమిడి సుబ్బా నాయుడు, ఉపాధ్యక్షుడు అంజి బాబు, నార్నే రమేష్ బాబు, సహాయ కార్యదర్శులు రమేష్ రెడ్డి, షేక్ సలామ్, మారినేని వెంకటేశ్వర్లు, నార్నే సతీష్‌బాబు, నరేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు.. మంటల్లో దగ్ధం

- డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిని రక్షించిన స్థానికులు



మంటల్లో కాలిపోతున్న కారు

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి ఇంజన్‌లో మంటలు చెలరేగడంతో కారు దగ్ధమైంది. ఈ సంఘటన త్రిపురాంతకం మండలం రాజుపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మాచర్లకు చెందిన డి.సైదులు త్రిపురాంతకం మండలంలోని వెల్లంపల్లిలో ఫంక్షన్ నిమిత్తం అత్తగారింటికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో కారులో సైదులు మాత్రమే ఉన్నారు. స్థానికులు వేగంగా స్పందించి డ్రైవింగ్ సీట్లో ఉన్న సైదులును బయటకు లాగి కాపాడారు. ప్రమాదం ధాటికి ఆయన రెండు కాళ్లు విరగడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సాంబశివయ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాచర్ల ఫాంలో వ్యక్తి మృతి

- మృతుడు మాజీ సైనికుడు



మృతి చెందిన నాగేశ్వరరావు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుబ్రహ్మణ్యం

రాచర్ల: మతి స్థిమితం లేక పొలాల్లో తిరుగుతున్న వ్యక్తిని కొందరు రైతులు గుర్తించి సపర్యలు చేస్తుండగా మృతి చెందాడు. ఈ సంఘటన రాచర్ల ఫాంలో చోటుచేసుకుంది. వివరాలు.. బేస్తవారిపేట మండలం, ఏకునాంబాదు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బత్తుల నాగేశ్వరరావు(45) గిద్దలూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న నాగేశ్వరరావుకు దారి తెలియక రాచర్ల ఫాం గ్రామ సమీపంలోని పొలాల్లో తిరుగుతుండగా ఆదే గ్రామానికి చెందిన కొందరు రైతులు చూసి చేతితో తాళాలు పెట్టారు. రాచర్ల ఫాం గ్రామానికి తీసుకొచ్చేలోపే నాగేశ్వరరావుకు మరోమారు మూర్ఛ రావడంతో మంచంపై పడుకోబెట్టి సపర్యలు చేశారు. కాసేపటికి నాగేశ్వరరావు మరణించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్సై పి.సుబ్రహ్మణ్యం, ఏఎస్సై ఆదిశేషయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నాగేశ్వరరావు భార్య శోభ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇస్తారా.. చావమంటారా?



టంగుటూరు రూరల్ విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న హరిబాబు



టంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సెల్ టవర్ ఎక్కిన హరిబాబు

- టంగుటూరు రూరల్ ఏఈ తీరును నిరసిస్తూ సెల్ టవర్ ఎక్కిన బాధితుడు
- పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కరించడంతో కథ సుఖాంతం

టంగుటూరు: తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించకుండా వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి బుధవారం టంగుటూరు రూరల్ విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట నిరసనకు దిగాడు. అయినా అధికారులు స్పందించకపోకపోవడంతో చావే శరణ్యమని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని సెల్ టవర్ ఎక్కాడు. వివరాలు.. టంగుటూరు మండలం జమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన బిళ్లా హరిబాబు, అతని తమ్ముడికి కలిసి ఒకే విద్యుత్ మీటర్ ఉంది. విద్యుత్ వినియోగం విషయమై అన్నదమ్ముల మధ్య గొడవ జరిగి బిల్లు చెల్లించకపోవడంతో అధికారులు సరఫరా నిలిపివేశారు. కొంత కాలం తర్వాత హరిబాబు విద్యుత్ బిల్లు కట్టేందుకు రూరల్ ఏఈ చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఎన్నికల కోడ్ ఉందని చెబుతూ కాలయాపన చేశారు. గత నెల 6వ తేదీన టంగుటూరు విద్యుత్ ఏడీ మోహనరావును సంప్రదించి, అదే రోజున రూ.5,654 బిల్లు చెల్లించాడు. అయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వని రూరల్ ఏఈ.. అసలు నువ్వు నీ తండ్రికి పుట్టావా, ధ్రువపత్రాలు తీసుకుని రా అంటూ, ఇళ్లు నీదేనా.. రూ.15 వేలు ఇస్తే కనెక్షన్ ఇస్తా అని చెప్పి ముఖంపై అర్జీ కాగితాలు విసిరికొట్టాడని బాధితుడు వాపోయాడు. సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న హరిబాబుకు పోలీసులు నచ్చజెప్పారు. లైన్‌మన్‌తో విద్యుత్ కనెక్షన్ ఇప్పించడంతో హరిబాబు సెల్ టవర్ దిగాడు.

గురుకులాల్లో గెస్ట్ టీచర్లకు దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, పీఈటీ పోస్టుల్లో గెస్ట్ టీచర్లను ఇంగ్లిషు మీడియంలో బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ డీ జయ తెలిపారు. ఆయా సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు, బీఈడీ సంబంధిత సబ్జెక్టు మెథడాలజీ , టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అన్నారు. డిగ్రీ, పీజీ ఇంగ్లిషు మీడియం చదివిన వారికి ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. బాలికల పాఠశాలలు, కళాశాలల్లో బోధించేందుకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. తగిన అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రం ఒక జత జెరాక్స్ కాపీలను చీమకుర్తి గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఇవ్వాలని చెప్పారు. ఈనెల 6వ తేదీ ఉదయం పది గంటలకు డెమో తరగతులు చీమకుర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల్లో జరుగుతాయన్నారు. డెమోలకు హాజరవుతున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ క్వాలిఫికేషన్స్ సర్టిఫికెట్స్‌లను తీసుకురావాలని కోరారు. ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ ఉంటుందని చెప్పారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.364

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర బుధవారం గరిష్టంగా కేజీ రూ.364 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 6055 బేళ్లు రాగా, 5504 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 551 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 96వ రోజు వేలం పాటలో 4168 బేళ్లు రాగా, 3785 వ్యాపారులు కొనుగోలు చేశారు. 383 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.364, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.268.03 వచ్చింది.

డీసీపల్లి, కలిగిరి, కందుకూరు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 91వ రోజు వేలం పాటలో 1887 బేళ్లు రాగా, 1719 బేళ్లు కొనుగోలయ్యాయి. 168 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.360, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.231 పలికింది.

టీచ్ టూల్ శిక్షణ కేంద్రం పరిశీలించిన ఆర్జేడీ



టీచ్ టూల్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

ఒంగోలు: స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ కేంద్రాన్ని గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. టీచ్ టూల్ కార్యక్రమం ఉపాధ్యాయుల బోధనలను మెరుగుపరిచేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా తరగతి వాతావరణం , బోధనా పద్ధతులు, సామాజిక భావోద్వేగ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు సహ ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించి టీచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనివల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ టి.కిషోర్ బాబు, ఏఎంఓ రమేష్, టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ నాయక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌ఎం పాఠశాల ఉపాధ్యాయులతో ఆర్జేడీ చర్చించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల నమోదు, నాణ్యమైన బోధనకు సంబంధించి అనుసరించాల్సిన విధానాలను వివరించారు.

ఖైదీలకు స్వయం ఉపాధిపై అవగాహన



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: జైలు శిక్ష అనంతరం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఖైదీలకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి తెలిపారు. స్వయం ఉపాధి శిక్షణ సంస్థ రూడ్ సెట్ బుధవారం జిల్లా జైలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకునేలా ఖైదీలకు శిక్షణ ఇస్తారని చెప్పారు. తద్వారా శిక్ష అనంతరం ఖైదీల మానసిక పరిస్థితిపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల గురించి రూడ్ సెట్ శిక్షకులు యూవీకే బాపూజీ వివరించారు. కార్యక్రమంలో జైలరు వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు: జిల్లాలో 102 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు తక్షణమే కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ప్రస్తుతం 28 ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా 102 మంది ఉపాధ్యాయులు అదనంగా ఉన్నారన్నారు. 36 ఎయిడెడ్ పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయని, వీరు ఒకటి నుంచి 5 తరగతులకు బోధించాల్సి వస్తోందన్నారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఒకరు లేదా ఇద్దరు టీచర్లు మాత్రమే ఎయిడెడ్ పాఠశాలల్లో బోధిస్తున్నారన్నారు. అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి



బాలికలతో మాట్లాడుతున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ఒంగోలు నగరంలోని భాగ్యనగర్‌లో బధిరుల పాఠశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వసతి గృహాల్లో తగిన సదుపాయాలు కల్పించడంతోపాటు యువతలో నైపుణ్యాన్ని పెంచుతామని, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహాలను తరచూ తనిఖీ చేస్తామన్నారు. సమస్యలు తెలియజేసేందుకు ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాళ్లు, సంక్షేమ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలకు పాల్పడిన

ఇద్దరు అధికారుల ఇంక్రిమెంట్ల నిలిపివేత

కర్నూలు(సెంట్రల్): 2012 సంవత్సరంలో ఒంగోలు మునిసిపాలిటీలో భవనాల అనుమతులకు అప్పటి టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీస్ ఎం.నారాయణరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీఓ) పి.శేషాచార్యులు అవినీతి, అక్రమాలకు పాల్పడనట్లు నిర్ధారణ కావడంతో ఉపలోకాయుక్త పి.రజనీ వారి ఇంక్రిమెంట్, పెన్షన్‌లో కోత విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఒంగోలులోని కొత్తపేటకు చెందిన పత్తిపాటి రామ్మూర్తి అనే వ్యక్తి 2012లో మునిసిపల్ కమిషనర్లుగా పనిచేసిన ఎస్.రవీంద్రబాబు, టి.అనురాధ భవనాల అనుమతులకు నిబంధనలను ఉల్లంఘించి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, వారిపై విచారణ జరపాలని లోకాయుక్తను ఆదేశించారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన లోకాయుక్త టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరక్టర్, అడిషనల్ సెక్రటరీ టు గవర్నమెంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌ను విచారణకు ఆదేశించింది. ఆయా సంస్థలు విచారణ చేసి ఇటీవల లోకాయుక్తకు నివేదిక సమర్పించాయి. అయితే ఇందులో ఇద్దరు మునిసిపల్ కమిషనర్లకు అవినీతిలో ప్రమేయం లేదని, అయితే టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీస్ ఎం.నారాయణరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీఓ) పి.శేషాచార్యులు వారిని తప్పుదోవ పట్టించినట్లు విచారణలో తెలింది. దీంతో ఉపలోకాయుక్త పి.రజనీ వారికి సంవత్సరిక ఇంక్రిమెంట్‌లో కోత విధించారు. అంతేకాక వారు రిటైర్ అయిన తరువాత వారి పెన్షన్‌లో 2.5 శాతాన్ని మూడేళ్లపాటు కోత విధించాలని తీర్పు చెప్పి కేసును ముగించారు.

శ్రీశైలం ఘాట్‌లో ప్రమాదం

- అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా
- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు



సురేష్‌రెడ్డి మృతదేహం

పెద్దదోర్నాల: అదుపుతప్పి దిచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలో శ్రీశైలం ఘాట్‌లోని పెద్దమూల టర్నింగ్ సమీపంలో బుధవారం జరిగింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దర్శి మండలం బొట్లపాలేనికి చెందిన పోలెంరెడ్డి సురేష్‌రెడ్డి సంఘటన స్థలిలోనే మృతి చెందగా బండారు ఆంజనేయులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అంకమ్మరావు కథనం ప్రకారం.. దోర్నాల నుంచి శ్రీశైలం వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం దోర్నాల, బోడేనాయక్ తండాల మధ్య అదుపుతప్పి బోల్తా పడటంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దర్శి వాసులు పోలెంరెడ్డి సురేష్‌రెడ్డి సంఘటన స్థలిలోనే మృతి చెందగా బండారు ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సారావుపేటకు రెఫర్ చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అంకమ్మరావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతి చెందిన దుప్పికి పోస్ట్‌మార్టం

- కుక్కల దాడిలో తీవ్ర గాయాలు



దుప్పికి పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారి

కొనకనమిట్ల: తీవ్ర గాయాలతో అటవీ ప్రాంతం నుంచి తప్పించుకుని జనావాసాల్లోకి వచ్చిన దుప్పి మృతి చెందింది. ఈ సంఘటన కొనకనమిట్ల మండలంలోని సిద్దవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో గొట్లగట్టు పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు దుప్పిని ఖననం చేశారు. తొలుత గాయాలతో గ్రామంలోకి వచ్చిన దుప్పిని పలువురు గ్రామస్తులు పట్టుకుని సపర్యలు చేశారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది వైద్య సేవలు అందించారు. అయినప్పటికీ తీవ్రంగా గాయపడిన దుప్పి మృతి చెందింది. కుక్కల దాడిలో దుప్పి తీవ్రంగా గాయపడిందని ఫారెస్ట్ అధికారులు చెప్పారు.

సాక్షి Smart Economic Display ADVERTISEMENT FEATURE



సాక్షి క్లాసిఫైడ్స్

Education

PARAMEDICAL

■ ప్రభుత్వ పారామెడికల్ డిప్లొమా కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radio graphic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-265]

Real Estate

FLATS FOR SALE

■ ఒంగోలు మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వెనుక వైపు 100% వాస్తు, కారు పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యం కల్గి రెడి టు ఆక్యూపై సూపర్ డీలక్స్ ఫ్లాట్స్-8 మొత్తంగా గాని / ఒక్కొక్కటిగా గాని అమ్మకమునకు కలవు. ✆ 98857 41410, 85198 55348 [O-793716]

HOUSE FOR SALE

■ ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో గల పేర్నమిట్టలోని అయ్యప్పస్వామి గుడివద్ద కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు 3వ ఫ్లోర్ పెంట్ హౌస్ 2BHK (950SFT) నార్త్ ఫేస్ అమ్మకంనకు కలదు. ✆ 94415 17773, 90631 01359 [O-793714]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted

■ ఒంగోలు పట్టణ వివాహిత మహిళలకు (10 మందికి మాత్రమే) ప్రముఖ కంపెనీలో పర్మనెంట్ జాబ్ అవకాశం. Q:డిగ్రీ, A:30సం॥పైన జీ॥ 17000/- నం॥✆ 9395526399, 9247124530 [O-793720]

■ 4th to 8th క్లాస్ మ్యాథ్స్, హిందీ సబ్జెక్ట్స్ బోధించుటకు Faculty కావలెను. సంప్ర॥ శారద విద్యానికేతన్ హైస్కూల్ ఈస్ట్ గంగవరం, తాళ్ళూరు. ✆ 99120 11805 [O-793719]

■ ఒంగోలులోని చైతన్యస్కూల్ నందు పని చేయుటకు టీచర్లు, డ్రైవర్లు, ఆయా, వాచ్‌మెన్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్ర॥ ✆ 91770 14253, 77807 79680. [O-793718]

■ ఒంగోలు మంగమూరు రోడ్డులో నారాయణ పబ్లిక్ స్కూల్ నందు పనిచేయుటకు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ టీచర్స్ మరియు ప్రైమరీ టీచర్స్ కావలెను. సంప్ర॥ ✆ 98491 83364. [OA-266]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185254]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185232]

■ ప్రకాశం జిల్లా, సంతనూతలపాడులోని గ్రానైట్ ఫ్యాక్టరీకి చదువు, అనుభవంగల సెక్యూరిటీ ఆఫీసర్ కావలెను. జనరల్ షిఫ్ట్, జీతం, PF, ESI, డ్యూటీపై ఫ్రీ మీల్స్. ✆ 78 93 88 44 21 [B-782118]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-13695]

■ Required Ex-service Man Guard / Gunman For DGR Work Location Nellore. Vacancy-10, Duty 8 hrs. 26 Days Gunman-1, Cont. ✆ 78939 65492, 73535 57463 [O-793715]